సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 3 । నవంబర్ । 2023



నిత్యాన్నదానానికి విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయంలో నిత్యాన్నదానం ట్రస్టుకు ఈమని వెంకట సూర్యనారాయణమూర్తి, రామలక్ష్మి దంపతులు గురువారం రూ.25 వేలు విరాళం అందించారు.



అన్నదానానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి విష్ణుబట్ల మురళీకృష్ణ, అనసూయలు గురువారం రూ.1,01,116 విరాళాన్ని గురువారం సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజి నుంచి గురువారం తూర్పుడెల్టాకు 3000, మధ్యడెల్టాకు 2300, పశ్చిమడెల్టాకు 6000 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజ్ వద్ద 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది.

న్యూస్‌రీల్

వాడపల్లి క్షేత్రం.. ఆధ్యాత్మిక వైభవం



శేష వాహనంపై స్వామివారికి ఊరేగింపు

ఆత్రేయపురం: వాడపల్లి క్షేత్రం గురువారం ఆధ్యాత్మికతతో మురిసింది.. వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. విశేష పూజల అనంతరం సాయంత్రం స్వామివారి శేషవాహన సేవ కడు రమణీయంగా జరిగింది. అశేష భక్తజనం మధ్య ఈ వేడుకను నిర్వహించారు.

వరల్డ్ ఫుడ్ ఇండియాకు ఆత్రేయపురం పూతరేకులు



ఆత్రేయపురం పూతరేకులతో ఢిల్లీ వెళ్లిన గాదిరాజు ప్రసాదరాజు తదితరులు

ఆత్రేయపురం: న్యూఢిల్లీ ప్రగతి మైదాన్‌లో ఈ నెల 3, 4, 5 తేదీల్లో జరిగే వరల్డ్ ఫుడ్ ఇండియా ప్రదర్శనకు ఆత్రేయపురం నుంచి పూతరేకులు తీసుకువెళ్లారు. ఈ గ్రామానికి చెందిన గాదిరాజు ప్రసాదరాజు, నాగమణితో పాటు మరికొందరు ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఫికానా ఫుడ్ అధినేత గాదిరాజు ప్రసాదరాజు మాట్లాడుతూ ఆత్రేయపురం పూతరేకులను ప్రదర్శించి తమ ప్రత్యేకతను చాటుతామన్నారు. సుమారు 60 దేశాల నుంచి వివిధ రకాల ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శిస్తారన్నారు.

వికాస ఆధ్వర్యంలో జాబ్ మేళా

రామచంద్రపురం: స్థానిక మోడరన్ డిగ్రీ కాలేజీ, వికాస ఆధ్వర్యంలో ఈ నెల 4న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో టెక్ మహీంద్రా కంపెనీలో బీపీఓ, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ ప్రొడక్షన్ ఏజెంట్, బీఓ (వాయిస్ ప్రాసెస్ తెలుగు), అనుజ మోటార్స్, శ్రీకాళహస్తి పైప్స్ లిమిటెడ్, ఇండోఎంఎం కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ అర్హత కలిగిన 30 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల జీతంతో పాటు భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. అభ్యర్థులు ఈ నెల 4వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు మోడరన్ కాలేజీకి ఒరిజినల్ సర్టిఫికెట్లు, జెరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ గుంటూరు మాణిక్యం ఫోన్ నంబరు 88975 61541లో సంప్రదించవచ్చని తెలిపారు.

జీజీహెచ్‌లో ఎంఆర్‌ఐ సేవలు ప్రారంభం

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో ఎంఆర్‌ఐ సేవలు ప్రారంభమయ్యాయి. జీజీహెచ్ ఇంచార్జి సూపరింటెండెంట్ డాక్టర్ హరి విజయకుమార్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, ఎంఎల్‌ఏ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, రేడియాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ బి.అనురాధలు సంయుక్తంగా ఆసుపత్రిలోని అత్యవసర విభాగంలో ఎంఆర్‌ఐ యంత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎంఎల్‌ఏలు మాట్లాడుతూ ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్య సేవల బలోపేతానికి నిబద్ధతతో కృషి చేస్తున్నారన్నారు. జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ఎంఆర్‌ఐ యంత్రం ఖరీదు రూ.11.5 కోట్లు అన్నారు. పాత యంత్రం మరమ్మతులకు నిపుణులు ఎంతగానో శ్రమించినా ఫలితం లేకపోయిందని ఎంపీ గీత తెలిపారు. ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి చొరవతో ఆసుపత్రికి నూతన యంత్రం మంజూరైందన్నారు. త్వరలో పూర్తిస్థాయి సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అత్యవసర స్థితి, న్యూరో సమస్యలతో బాధపడుతున్న రోగులకు ఎంఆర్‌ఐ యంత్రం ఓ వరమని అన్నారు. త్వరలో ఆసుపత్రిలో క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటు కానుందన్నారు. 97 శాతం నర్సింగ్ సిబ్బంది నియామకాల ప్రక్రియ చివరి దశకు వచ్చిందని, త్వరలో నియామకాలు పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో కొండా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కాకినాడ మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న, నగర ఏఎంసీ చైర్మన్ పి.వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సదా మీ సేవకై...

- 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు జనం జేజేలు
- జిల్లాలో ఇప్పటి వరకూ 518 వైద్య శిబిరాలు
- మొత్తం 2.19 లక్షల మందికి సేవలు
- ఇంటి ముంగిటకే వైద్యంపై హర్షాతిరేకాలు



సంధిపూడిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణురాలు శ్రీలక్ష్మి



జొన్నాడలో సురక్ష వైద్యశిబిరంలో రక్త పరీక్షలు చేస్తున్న సిబ్బంది

అలమూరు: వైద్యం కోసం ఆస్తులు అమ్ముకోవడం చూశాం.. ఆరోగ్యం కోసం అప్పులు చేసి ఎన్నో కుటుంబాలు వీధిన పడటం గమనించాం.. ఇది గత టీడీపీ హయాంలో మాట. నేడు పేదవాడికీ కార్పొరేట్ వైద్యం అందాలనేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యం. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడిని నిజం చేస్తోంది. వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఇందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించాలనే లక్ష్యం నెరవేరుతోంది. గత ప్రభుత్వంలో కార్పొరేట్ వైద్యం అంటే పేద, మధ్య తరగతి ప్రజలకు అందని ద్రాక్షలా ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అందరికీ మెరుగైన వైద్యం అందుతోంది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత వైద్యారోగ్య శాఖలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారు. ఇప్పటికే వైద్య శాఖలో పోస్టులన్నీ భర్తీ చేయడంతో పాటు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం తీసుకువచ్చి గ్రామీణ ప్రాంత వాసులకు ఇంటికే వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారు. ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తుంది. అనేకమంది రోగాలకు చికిత్స అందిస్తుంది. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి వారి జీవన ప్రమాణాలను పెంచేందుకు కృషి చేస్తుంది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో 22 మండలాలు, మూడు అర్బన్ ప్రాంతాల్లో గ్రామ, వార్డు సచివాలయాల్లో 53 పీహెచ్‌సీలు ఉన్నాయి. వాటి పరిధిలో 115 మంది వైద్యాధికారుల ఆధ్వర్యంలో సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకూ జిల్లాలో 518 జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ నెల 15 వరకూ మిగిలిన చోట్ల శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ శిబిరాల్లో వివిధ విభాగాల్లో నిష్ణాతులైన 146 మంది వైద్యులతో పాటు 426 మంది ఎంఎల్‌హెచ్‌పీలు, 587 మంది ఏఎన్‌ఎంలు, 1,395 మంది ఆశ కార్యకర్తలు సేవలు అందిస్తున్నారు. ఉచితంగా 105 రకాల మందులు అందజేస్తున్నారు. అలాగే అవసరమైన రోగులకు 14 రకాల పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణకు అనుగుణంగా చికిత్స అందిస్తున్నారు.

రికార్డు స్థాయిలో నిర్వహణ

పేదలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం నెల రోజుల ముందుగానే ఆయా పీహెచ్‌సీ వైద్యాధికారుల పర్యవేక్షణలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించింది. ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ఏర్పాటు గురించి తెలియజేశారు. ఆయా శిబిరాల ద్వారా జిల్లాలో 2.19 లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, అందులో సాధారణ వైద్య సేవలకు సంబంధించి 1,75,084, వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా 43,538 మంది కంటి వైద్య సేవలు పొందారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న 2,024 మందిని గుర్తించి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ ఆస్పత్రులకు సిఫారసు చేశారు. అవసరమైన రోగులకు శస్త్రచికిత్సలు చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని ఆయా గ్రామాల్లో సుమారు 20 వేల మందికి కళ్లజోళ్లు పంపిణీ చేసి, అందులో కంటి లోపాల తీవ్రత అధికంగా ఉన్న పలువురికి కంటి శస్త్రచికిత్సలు చేయిస్తున్నారు. కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఇంటి ముంగిట్లోనే అందడంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

'ఆహా'రం.. ఆకర్షణీయం

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శనలు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. ప్రతి జేజేఎస్ శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పోటీపడి రికార్డు స్థాయిలో వంటకాలను తయారు చేసి శిబిరానికి వచ్చిన రోగులకు అందజేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. నిత్యం ఇంట్లో లభించే ఆహార పదార్థాలతో పౌష్టికాహారాన్ని తయారు చేసుకునే విధానం, చిరు ధాన్యాలను తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ఫ్లెక్సీల ఏర్పాటు ద్వారా వివరించే ప్రయత్నం చేస్తున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు సద్వినియోగం చేసుకోవాలని బాలింతలు, గర్భిణులకు వివరిస్తున్నారు. అలాగే గర్భిణులకు సామూహిక సీమంతాలు హిందూ సనాతన సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయి.

జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో సేవలు ఇలా..

మండలం	సాధారణ సేవలు	కంటి సేవలు	వైఎస్సార్ ఆరోగ్యశ్రీ
అయినవిల్లి	8,581	1,702	81
ఆలమూరు	7,933	2,288	173
అల్లవరం	8,811	3,639	288
అమలాపురం, అర్బన్	10,152	3,206	148
అంబాజీపేట	6,946	2,543	166
ఆత్రేయపురం	9,171	1,867	18
ఐ.పోలవరం	9,166	1,151	82
కె.గంగవరం	7,160	1,888	96
కపిలేశ్వరపురం	8,003	1,973	108
కాట్రేనికోన	10,422	1,014	102
కొత్తపేట	6,386	1,399	34
మలికిపురం	6,210	2,131	31
మామిడికుదురు	9,554	3,129	110
మండపేట, అర్బన్	6,603	1,823	65
ముమ్మిడివరం	7,122	1,639	119
పి.గన్నవరం	6,152	1,468	101
ఆర్‌సీపురం, అర్బన్	7,221	2,268	29
రావులపాలెం	9,526	2,132	14
రాయవరం	6,891	1,717	34
రాజోలు	10,143	1,961	128
సఖినేటిపల్లి	6,836	1,132	57
ఉప్పలగుప్తం	5,895	1,278	39
మొత్తం	17,5084	43,538	2,024

అనూహ్య స్పందన



పేదలకు మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. దీనిద్వారా ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించి మెరుగైన వైద్యం అందించగలుగుతున్నాం. మధుమేహం, రక్తపోటు, రక్తహీనత తదితర సమస్యలు ఉన్నవారిని గుర్తించి ఉచితంగా మందులను అందజేస్తున్నాం.

– ఎం.సుమలత, అదనపు జిల్లా వైద్యాధికారి, కొత్తపేట

ఆరోగ్యంపై ధీమా



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు ఆరోగ్యంపై ధీమా కలుగుతోంది. ఈ వైద్య శిబిరాల్లో వైద్యారోగ్య శాఖ సిబ్బంది అనేక పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోగ నిర్ధారణ చేసి ఉచితంగా మందులు ఇస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంతో అందరికీ మేలు జరుగుతోంది.

– ముద్దాల వెంకన్న, సంధిపూడి

సేవలతో ఆసరా



సుదూర ప్రాంతాలకు వెళ్లి చికిత్స చేయించుకోలేని తమలాంటి వృద్ధులకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఆసరాగా నిలుస్తోంది. గ్రామ సచివాలయానికి వైద్యులు వచ్చి పరీక్షలు చేసి మందులు అందించారు. సంపూర్ణ ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. ఇంట్లో సరకులతో పోషకాహారాన్ని ఎలా తయారు చేసుకోవచ్చో ప్రదర్శనల ద్వారా తెలియజేశారు.

– పోలిశెట్టి రత్నం, పెనికేరు

ధాన్యం కొనుగోలుకు పటిష్ట కార్యాచరణ

జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్

అమలాపురం రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ రూపొందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ సూచించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నుంచి 22 మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ సన్నద్ధతపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే సామాజిక తనిఖీ పూర్తయ్యిందని, ధాన్యం సేకరణకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు ఆధారంగా రైతుల డేటాను త్వరలోనే అందిస్తామన్నారు. ఈ నెల 4 తర్వాత ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. ఇప్పటికే దీనికి సంబంధించి మిల్లర్లతో చర్చించామని, మిల్లర్లు గోనె సంచులను ఆర్బీకేలకు సరఫరా చేస్తారని అన్నారు. ఆర్బీకేల్లో వీలైనంత ఎక్కువ సంఖ్యలో గోనె సంచులు నిల్వ చేయాలని ఆదేశించారు. ధాన్యం రవాణాకు వినియోగించే వాహనాలకు జీపీఎస్ సిస్టం అందుబాటులో ఉండాలని, లేనిపక్షంలో ధాన్యం సరఫరా చేసిన రైతుకు ధాన్యం సొమ్ము జమ కావని ఆమె స్పష్టం చేశారు. జిల్లాలో 524 వాహనాలకు రిజిస్ట్రేషన్ ఈపీఎస్ సిస్టం ఏర్పాటుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం రవాణాకు మిల్లర్లకు చెందిన వాహనాలను వినియోగిస్తే వాటికీ ఈపీఎస్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. మండలాల్లో కొత్త సిబ్బందికి శిక్షణ అనంతరం అందరితో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై ట్రయల్ రన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తేమ శాతాల్లో వ్యత్యాసం ఉత్పన్నం కాకుండా టెక్నికల్ అసిస్టెంట్లు స్వయంగా రైతు క్షేత్రాల్లో కళ్లాల వద్దకు వెళ్లి నాలుగైదు చోట్ల ధాన్యం రాశుల్లో నమూనాలు సేకరించి పక్కాగా పరీక్షలు చేయాలని స్పష్టం చేశారు. తూకాలలో మిల్లర్లు, రైతులకు మధ్య సమస్యలు ఉత్పన్నం కాకుండా సిబ్బంది చూడాలన్నారు. సమావేశంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ ఎస్.సుధాసాగర్, డీఎస్‌ఓ ఎ.పాపారావు, జిల్లా రవాణా అధికారి అశోక్ ప్రతాప్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎ.బోసుబాబు, జిల్లా సహకార అధికారి రాధాకృష్ణారావు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకురాలు కె.విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

ధర్మ ప్రచార వారోత్సవాలకు ఏర్పాట్లు

సఖినేటిపల్లి: రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో అంతర్వేది లక్ష్మీనృసింహుని దేవస్థానం పర్యవేక్షణలో రాజోలు దీవిలోని వివిధ ప్రాంతాల్లో ధర్మ ప్రచార వారోత్సవాలకు షెడ్యూల్ ఖరారు చేసినట్లు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ గురువారం తెలిపారు. ఆయా గ్రామాల్లో ఆలయాల వద్ద ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ స్వామివారికి అభిషేకాలు, సహస్ర నామార్చనలను అర్చకులు నిర్వహిస్తారన్నారు. ఇందులో భాగంగా 5న చింతలమోరి బీచ్ నగర్‌లోని రామాలయం వద్ద, 6న అడవిపాలెం మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద, 7న గొంది ముత్యాలమ్మ ఆలయం వద్ద, 8న సఖినేటిపల్లి గీతామందిరం వద్ద, 9న కడలి కపోతేశ్వరస్వామివారి ఆలయం వద్ద, 10న శివకోటిపాలెం గణపతి ప్రయుక్త కనకదుర్గాదేవి అమ్మవారి ఆలయం వద్ద, 11న గూడపల్లి- పల్లిపాలెం కోదండ రామాలయం వద్ద ధర్మ ప్రచార కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆయా ఆలయాల వద్ద జరిగే పూజల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సహకార సంఘాలను బలోపేతం చేద్దాం

- రైతుల భాగస్వామ్యాన్ని పెంచుదాం
- ఐసీఎం కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీఎం కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్

అమలాపురం టౌన్: బలహీనంగా ఉన్న వ్యవసాయ సహకార సంఘాలను మరింత బలోపేతం చేసి, రైతుల భాగస్వామ్యాన్ని పెంచినప్పుడే సహకార వ్యవస్థ మనుగడ సాకారమవుతుందని ఉభయ తెలుగు రాష్ట్రాల ఇనిస్టిట్యూట్ ఆఫ్ కో ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసీఎం) కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్‌వీ శ్రీనివాస్ సూచించారు. అమలాపురంలోని డీసీసీబీ బ్రాంచ్‌లో జిల్లాలోని వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, సీఈఓలతో గురువారం సమీక్షా సమావేశం జరిగింది. దీనికి జిల్లా సహకార అధికారి (డీసీఓ) ఎ.రాధాకృష్ణారావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడారు. భారత ప్రభుత్వ పర్యవేక్షణలో పనిచేసే ఐసీఎం తెలుగు రాష్ట్రాల్లో సహకార సంఘాల బలోపేతానికి ప్రణాళికా బద్ధమైన చర్యలతో ముందుకు సాగుతోందన్నారు. సంఘాల్లో ఆర్థిక అవకతవకలను పూర్తిగా అదుపు చేయాలని ఆయన ఆకాంక్షించారు. కొన్ని సంఘాల్లో ఆర్థిక నేరాలతోనే నష్టాల బారిన పడి సహకార మనుగడ దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అవకతవకల అదుపునకు సహకార సంఘాల్లో సకాలంలో పక్కా ఆడిట్ జరిగి తీరాలని సూచించారు. కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్‌లు ఇచ్చే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌లో కేవలం రైతులకు రుణాలివ్వడానికే సంఘాలు పరిమితం కాకూడదని, సహకార స్ఫూర్తిని బలపరిచేలా, పరపతేతర వ్యాపారాలతో సంఘాలను లాభాల బాటలో నడిపించాలని స్పష్టం చేశారు. సంఘాల బలోపేతం, రైతుల భాగస్వామ్యం, ఆడిట్ నిర్వహణ తదితర అంశాలపై డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. రాష్ట్ర అగ్రి మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబి), డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల బ్రహ్మాజీ, జిల్లా సహకార ఆడిట్ అధికారి ఎస్.మురళీకృష్ణ, రాజమహేంద్రవరం సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు, జిల్లా సహకార ట్రైనింగ్ ఆఫీసర్ ఆదిమూలం వెంకటేశ్వరావు ప్రసంగించి జిల్లా సహకార వ్యవస్థను, సంఘాలను మరింత పటిష్టం చేసే అంశాలపై వివరించారు.

అభ్యసన సామర్థ్యాలపై నేడు పరీక్ష

- జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో 'సీస్' సర్వే
- పరీక్ష రాయనున్న 24,855 మంది విద్యార్థులు



సీస్ పరీక్షకు తర్ఫీదు పొందుతున్న విద్యార్థులు

రాయవరం: పాఠశాల విద్యా వ్యవస్థ స్వరూపాన్ని, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేసేందుకు ప్రతి మూడేళ్లకు ఒకసారి నిర్వహించే సర్వే శుక్రవారం జిల్లాలో జరగనుంది. 2024 ఫిబ్రవరిలో నిర్వహించనున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేకు ముందుగా ప్రాక్టీస్‌గా స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (సీస్) పరీక్షను నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,035 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ర్యాండమ్‌గా 976 ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలను సర్వేకు ఎంపిక చేశారు. 3, 6, 9 తరగతి విద్యార్థులకు ఓఎంఆర్ బేస్డ్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నారు. నిర్వహణ నిమిత్తం డిగ్రీ, ఇంజినీరింగ్, డీఎడ్, బీఎడ్ కళాశాలలకు చెందిన 1,075 మంది విద్యార్థులను ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు (ఎఫ్ఐ)గా నియమించారు. పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేసే పనిలో భాగంగా గత నెల 27 నుంచి విద్యార్థులకు ప్రాక్టీస్ టెస్టులు నిర్వహించారు.

ఓఎంఆర్ విధానంలో పరీక్ష

సీస్ సర్వే పరీక్షను శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు. పరీక్ష పూర్తిగా ఓఎంఆర్ విధానంలో ఉంటుంది. 3, 6, 9 తరగతుల విద్యార్థులకు తెలుగు/ఇంగ్లిషు, గణితం, పరిసరాల విజ్ఞానం, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు/ఇంగ్లిషు, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహిస్తారు. 3వ తరగతి విద్యార్థులకు 60 నిమిషాలు, 6వ తరగతికి 75 నిమిషాలు, 9వ తరగతికి 90 నిమిషాల పాటు పరీక్ష ఉంటుంది. సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులు పరీక్ష రాస్తే మాత్రం 30 నిమిషాలు అదనపు సమయాన్ని కేటాయిస్తారు. జిల్లాలో 3వ తరగతికి సంబంధించి ప్రైవేట్ అన్ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన 4,408 మంది, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 4,087 మంది పరీక్ష రాయనున్నారు. 6వ తరగతికి సంబంధించి ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన 122, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన 3,479, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 4,977 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. తొమ్మిదో తరగతికి సంబంధించి ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల నుంచి 83, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల నుంచి 2,740, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 4,959 మంది పరీక్ష రాస్తారు.

సందేహాలు ఉంటే..

'సీస్' పరీక్షకు సంబంధించి కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణలో సమస్యలు ఏర్పడినా, సందేహాలు కలిగినా కాల్ సెంటర్‌కు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు చేసి నివృత్తి చేసుకోవచ్చని డీఈఓ కమలకుమారి తెలిపారు. కాల్ సెంటర్‌లో సమగ్ర శిక్షా ఏఎంఓ పి.రాంబాబు (94411 39111), డైట్ లెక్చరర్, ఎస్.బాలరాజు (91778 32979), డీసీఈబీ సెక్రటరీ, బి.హనుమంతరావు (98856 53802), డీఈఓ కార్యాలయ ఏపీఓ, బి.ఆదినారాయణ మూర్తి (99494 94659)కి ఫోన్ చేయవచ్చని అన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓ పీఆర్డీ ఆత్మహత్య



ఈఓ పీఆర్డీ వెంకటేశ్వరరావు (ఫైల్)

అల్లవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీగా విధులు నిర్వర్తిస్తున్న కొండా వెంకటేశ్వరరావు (58) గురువారం ఉదయం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు, సహోద్యోగుల కథనం ప్రకారం.. అల్లవరం ఈఓ పీఆర్డీగా వెంకటేశ్వరరావు రెండేళ్ల కిందట విధుల్లో చేరారు. ఏడాది పాటు దీర్ఘకాలిక సెలవు తీసుకుని ఆరు నెలల కిందట తిరిగి విధుల్లోకి వచ్చారు. బుధవారం సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయంలో విధులు నిర్వర్తించే నాని నుంచి తనకు కార్యాలయంలో పని ఉందని, ఆఫీస్ తాళాలు తీసుకుని రాత్రికి అక్కడే ఉండిపోయారు. గురువారం తెల్లవారుజామున తన కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించే రమేష్ మొబైల్‌కు గుడ్ మార్నింగ్ మెసేజ్ చేశారు. 9.45 గంటలకు కార్యాలయానికి వచ్చిన రమేష్ కార్యాలయం తెరచి ఉండడాన్ని గమనించారు. ఆఫీస్ రూమ్‌లోకి వెళ్లి చూసేసరికి వెంకటేశ్వరరావు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించారు. దీంతో రమేష్ ఎంపీడీఓ కృష్ణమోహన్‌కు సమాచారం ఇచ్చారు. ఎంపీడీఓ ఘటనా స్థలానికి వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ అంబికాప్రసాద్, సీఐ వీరబాబు, ఎస్సై హరీష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఎంతో సౌమ్యుడిగా ఉండే ఈఓపీఆర్డీ ఎందుకు ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చిందోనన్న విషయాలపై ఆరా తీశారు. డీఎస్పీ అంబికాప్రసాద్ ప్రాథమిక విచారణలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించే రమేష్ మొబైల్‌కు తెల్లవారు జామున 4.36 గంటలకు గుడ్ మార్నింగ్ మెసేజ్ చేశారని గుర్తించారు. ఆ తర్వాత తన భార్య, సోదరుడితో 6.30 గంటలకు ఫోన్‌లో మాట్లాడారని డీఎస్పీ తెలిపారు. ఆరున్నర తర్వాత ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని అన్నారు. మరిన్ని ఆధారాల సేకరణకు క్లూస్ టీమ్‌ను రప్పించామన్నారు. పని ఒత్తిడా, కుటుంబ సమస్యలా అనే విషయాలు తెలియాల్సి ఉందన్నారు. మృతుడి భార్య ఇందుపల్లి-2లో మహిళా పోలీస్‌గా విధులు నిర్వర్తిస్తున్నారని, కుమారుడు, కుమార్తె ఉన్నారని వివరించారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ అంబికాప్రసాద్‌తో పాటు ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, డీపీఓ కృష్ణకుమారి, డీఎల్‌పీఓ బొజ్జరాజు, తహసీల్దార్ సాంబశివప్రసాద్ తదితరులు పరిశీలించారు.

క్లుప్తంగా

ఆబోతు వీరంగం

ఐదుగురికి గాయాలు



ఆబోతుకు మత్తు ఇంజక్షన్ ఇస్తున్న పశు వైద్యాధికారి శివప్రసాద్

సామర్లకోట: స్థానిక వీర్రాఘవపురంలో ఆబోతు వీరంగం సృష్టించడంతో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. గురువారం ఉదయం ఆబోతు ఒకసారిగా ఎగురుతూ బీభత్సం సృష్టించింది. ఎదురు పడిన వారిపై దాడి చేసింది. ఆ ప్రాంతంలో ఓ మహిళా పారిశుధ్య కార్మికురాలు, బలుసులపేటకు చెందిన న్యాయవాది పెయ్యల చక్రవర్తితో పాటు మరో ముగ్గురుపై దాడి చేసింది. చక్రవర్తి తీవ్రంగా గాయపడటంతో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మిగిలిన వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. స్థానిక యువకులు ఆబోతును తాళ్లతో బంధించి చెట్టుకు కట్టేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గంగిరెడ్డి కృష్ణమూర్తి సమాచారంతో పశుసంవర్ధక శాఖ ఏడీ తాత ఆధ్వర్యంలో డాక్టర్లు శివప్రసాద్, వర్మలు ఆబోతుకు మత్తు ఇంక్షన్ ఇచ్చారు. ఏడీ తాత ఆబోతు పరిస్థితిని పరిశీలించారు. దీనిని రోడ్లపై తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్షతగాత్రులను మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు పరామర్శించారు. కమిషనర్ మాట్లాడుతూ రెండు రోజుల్లో రోడ్లపైకి పశువులు రాకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

బ్రహ్మాండనాయకా ప్రణమామ్యహం

- వైభవంగా వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు
- ప్రత్యేక పూజలు, హోమాలతో ప్రారంభం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఆత్రేయపురం: బ్రహ్మాండనాయకునికి భక్తులు హారతులు పట్టారు.. బ్రహ్మోత్సవాల ప్రారంభ వేళ ఆ స్వామివారిని చూసి పరవశించిపోయారు.. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఆధ్యాత్మిక వైభవం సంతరించుకుంది. ఉదయం స్వామివారి బ్రహ్మోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. స్వామివారికి స్వస్తి వచనం, పుణ్యాహవాచనం, ఋత్విక్‌వరణ, దీక్షాధారణ, అగ్నిప్రతిష్ఠాపన, దిగ్దేవతా ప్రార్థన, విశేషార్చన, తీర్థప్రసాద గోష్టి, సాయంత్రం 4 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, వాస్తుపూజ, అగ్నిమథనం, వాస్తుహోమం, ధ్వజపతాక హోమాలు, నవమూర్తి అవాహన, భేరీపూజ, ధ్వజారోహణ, బలిహరణ, నీరాజనం తదితర పూజలను కనుల పండువగా నిర్వహించారు. అనంతరం పరావాసుదేవ అలంకరణలో శేషవాహన సేవ జరిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ఉత్సవాల్లో పాల్గొని ఆనందపరవశితులయ్యారు. ఉదయం తీర్థ బిందెతో గోదావరి జలాలను తీసుకు వచ్చి స్వామివారికి అభిషేకాలతో పాటు గోత్రనామాలతో పూజలు, నిత్య హోమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవ పూజలను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో వైఖానస యువబ్రహ్మ ఆగమ భాస్కర ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు చేశారు. అలాగే ఆలయంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అదిలాబాద్‌కు చెందిన రాజన్న డోలు కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. ఆలయం వద్ద గోవింద నామస్మరణ మార్మోగింది. భక్తుల రద్దీ నేపథ్యంలో ఇబ్బందులు కలగకుండా ఎస్సై బీవై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు ఆధ్వర్యంలో సభ్యులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు



హారతి తీసుకుంటున్న భక్తులు

శేషవాహనం విశిష్టత

బ్రహ్మోత్సవ సమయంలో శేష వాహనంపై పరావాసుదేవ అలంకరణతో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. ఈ వాహనంపై స్వామివారిని దర్శిస్తే వైకుంఠంలో శ్రీమన్నారాయణను చూసిన ఫలితం కలుగుతుందని భక్తుల విశ్వాసం. వైకుంఠంలో స్వామివారు శేష వాహనంపై పాన్పులో ఉంటారు. బ్రహ్మోత్సవాల్లో ప్రథమ వాహనం శేష వాహనం కావడంతో దర్శించుకుంటే మంచి ఫలితాలు వస్తాయని భక్తుల నమ్మకం.

నేటి కార్యక్రమాలివి

ఉదయం స్వామివారికి శోభయాత్రగా గోదావరి నది జలాల సంగ్రహణ, మహా పుష్పయాగం, సాయంత్రం సహస్ర దీపాలంకరణ, సరస్వతీ అలంకరణతో హంస వాహన సేవ తదితర పూజలు నిర్వహిస్తారు.



ఆకట్టుకున్న డోలు వాయిద్యం



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

అనపర్తి: పొలమూరు పరిధిలోని అనపర్తి దేవస్థానం కాలనీకి చెందిన ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై గురువారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. దేవస్థానం కాలనీకి చెందిన మేడిశెట్టి శ్రీను (50) కల్లు గీతతో జీవనం సాగిస్తున్నాడు. గురువారం కొబ్బరి బొండాలు దించేందుకు చెట్టు ఎక్కిన శ్రీను కొబ్బరి ఆకు అడ్డు రావడంతో దానికి తొలగించే క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతను కింద ఉన్న బోదెలో పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై జగన్‌మోహన్ రావు ఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పెళ్లింట విషాదం

- ట్యాంకర్‌ను ఢీకొన్న పెళ్లి బస్సు
- చికిత్స పొందుతూ మహిళ మృతి
- ఐదుగురికి తీవ్ర గాయాలు

దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి–గోపాలపురం రోడ్డులోని జాతీయ రహదారిపై డైమండ్ జంక్షన్ వద్ద గురువారం ఘోర ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కాకినాడ జిల్లా తాళ్లూరుకు చెందిన యార్లగడ్డ కృష్ణవేణి (50) మృతి చెందగా, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులు రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం తాళ్లూరుకు చెందిన వధువుతో బుధవారం రాత్రి పశ్చిమగోదావరి జిల్లా పెదతాడేపల్లికి చెందిన వరుడికి వివాహం జరిగింది. అనంతరం గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో వధువు తరఫున బంధువులు 25 మంది జయంతి ప్రైవేట్ ట్రావెల్ బస్సులో పెదతాడేపల్లిలో వరుడి ఇంటి వద్ద జరుగుతున్న సత్యనారాయణస్వామి వ్రతానికి బయలు దేరారు. 11 గంటలకు బస్సు దేవరపల్లి సమీపానికి చేరుకుంది. గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారి (ఎన్‌హెచ్–16)పై దేవరపల్లి సమీపంలో డైమండ్ జంక్షన్ వద్ద రహదారి మధ్యలో ఉన్న మొక్కలను తడపడానికి ఉన్న వాటర్ ట్యాంకర్‌ను పెళ్లి బృందం బస్సు ఢీకొని అదుపుతప్పి పక్కన ఉన్న డ్రైన్‌లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న శలగల నాగలక్ష్మి, యార్లగడ్డ కీర్తన, ముత్తాల సత్యనారాయణ, మేడ్ని సుబ్బలక్ష్మి, యార్లగడ్డ రామారావు, యర్లగడ్డ కృష్ణవేణి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న సీఐ అనసూరి శ్రీనివాస్, ఎస్సై కె.శ్రీహరిరావు సంఘటనా స్థలానికి చేరుకుని బస్సులోని ప్రయాణికులను బయటకు దించి క్షతగాత్రులను 108 అంబులెన్స్, 1033 హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కృష్ణవేణి (50) చికిత్స పొందుతూ మృతి చెందింది. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీహరిరావు తెలిపారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ప్రమాదం జరిగిందని ఆయన తెలిపారు. సాయంత్రం కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ ప్రమాద స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాల నివారణకు పలు సూచనలు చేశారు.



దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద బోల్తాపడిన పెళ్లి బృందం ట్రావెల్ బస్సు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగలక్ష్మి



మృతి చెందిన యార్లగడ్డ కృష్ణవేణి

క్షతగాత్రులకు ఎమ్మెల్యే వెంకట్రావు పరామర్శ

దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద జరిగిన బస్సు ప్రమాద స్థలానికి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు హుటాహుటిన చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. దగ్గరుండి క్షతగాత్రులను రాజమహేంద్రవరం ఆసుపత్రి కి తరలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు.



అదును చూసి.. చోరీ చేసి

- రూ.18.50 లక్షల నగదు, 29.5 తులాల బంగారం అపహరణ
- కేసు ఛేదించేందుకు ప్రత్యేక బృందాలు: డీఎస్పీ

తుని రూరల్: అంతా పెళ్లి సందడిలో ఉండగా.. పెళ్లింట్లో దొంగలు పడ్డారు.. భారీగా నగలు, బంగారం చోరీ చేసి దర్జాగా ఉడాయించారు. ఈ సంఘటన తుని మండలం ఎస్.అన్నవరంలో బుధవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో జరిగింది. వెంటనే గుర్తించిన ఆ కుటుంబ సభ్యులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెద్దాపురం డీఎస్పీ లలితాకుమారి, సీఐ సన్యాసిరావు, సీసీఎస్ డీఎస్పీ రాంబాబు, సీఐ కిశోర్‌బాబు, ఎస్సై విజయబాబు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హుటాహుటిన కాకినాడ నుంచి క్లూస్ టీం, వేలిముద్రల నిపుణులను రప్పించి విచారణ చేపట్టారు. చోరీ జరగడంతో సందడిగా ఉండాల్సిన పెళ్లింటా విచారం నెలకొంది.

అసలేం జరిగిందంటే...

చోరీ ఘటనపై పెద్దాపురం డీఎస్పీ లలితాకుమారి కథనం ప్రకారం.. ఎస్.అన్నవరం గ్రామానికి చెందిన ముత్తా సత్యనారాయణ (సత్తిబాబు) తన కుమారుడి వివాహాన్ని ఇంటికి దూరంగా గెద్దబీడు వద్ద సాయివేదికలో నిర్వహించారు. వివాహం జరుగుతున్న సమయంలోనే సత్తిబాబు ఇంట్లో రాత్రి పది గంటలకు చోరీ జరిగినట్టు సమాచారం. వివాహానికి అవసరమైన దుస్తులు మరిచిపోవడంతో పదిన్నర గంటలు దాటిన తర్వాత సత్తిబాబు అల్లుడు, కుమార్తె ఇంటికి వచ్చేసరికి తలుపు తీసి ఉండడం, ఇంట్లో ఉన్న బీరువాలో ఉండాల్సిన దుస్తులు, ఇతర వస్తువులు మంచంపై చెల్లాచెదురుగా పడి ఉండడాన్ని గమనించి, చోరీ జరిగినట్టు గుర్తించారు. అల్లుడు, కుమార్తె ద్వారా సమాచారం తెలుసుకున్న సత్తిబాబు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొత్తం 29.5 తులాల బంగారు ఆభరణాలు, రూ.నాలుగు లక్షల విలువ చేసే ప్లాటినం చైన్, రూ.1.50 లక్షల విలువైన డైమండ్ రింగ్, రూ.18.50 లక్షల నగదు, రెండు ఫోన్‌లు చోరీకి గురైనట్టు బాధితుడు ఫిర్యాదు పేర్కొన్నారు. రాత్రి పది గంటల నుంచి పదిన్నర గంటల మధ్యలో చోరీ జరిగిందని, ఆ సమయంలో ఒక వ్యక్తి సత్తిబాబు ఇంట్లోంచి సంచితో బయటకు వచ్చి మోటార్ సైకిల్‌పై వెళ్లినట్టు తెలిసిందని డీఎస్పీ తెలిపారు. పెళ్లింటికి వచ్చిన వారెవరో వెళుతున్నట్టు స్థానికులు భావించారు. ఇలా దొంగతనం చేసి నిందితుడు దర్జాగా పరారయ్యాడు. పెళ్లింట్లో జరిగిన చోరీ కేసును ఛేదించేందుకు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు పెద్దాపురం డీఎస్పీ లలితాకుమారి తెలిపారు. సాంకేతిక సమాచారం, ఇతరేతర ఆధారాలతో త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామన్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీసీఎస్ డీఎస్పీ రాంబాబు, సీఐ కిశోర్‌బాబు

అతని నేత్రాలు.. వెలుగునిచ్చే జ్యోతులు



తవ్వా సత్తిరాజు (ఫైల్)

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలేనికి చెందిన తవ్వా సత్తిరాజు (84) గురువారం మృతి చెందారు. తమ తండ్రి నేత్రాలు ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన కుమారుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు తవ్వా జగదీష్‌బాబు, కుమార్తెలు మాజేటి నాగజ్యోతి, కాళ్లకూరి నాగసత్యరాణిలు భావించారు. దీంతో కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు సమాచారం ఇచ్చారు. ఐ బ్యాంకు ప్రతినిధులు గొర్రెల రవికుమార్, తాటికాయల వీరేంద్రలు వచ్చి మృతుని కార్నియాలు సేకరించి తీసుకెళ్లారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్

రావులపాలెం: రెండు వేర్వేరు కేసుల్లో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 122 గ్రాముల వెండి, 41.5 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటరమణ గురువారం తెలిపారు. గత నెలలో రావులపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో వెదిరేశ్వరం, రావులపాలెం గ్రామాల్లో జరిగిన చోరీ కేసుల్లో నిందితులైన భీమవరానికి చెందిన వెంపల చంటి, రాజమహేంద్రవరానికి చెందిన కోనూరి శ్రీనివాసరావులు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు పట్టుకున్నారు. వారిని అరెస్టు చేసి రెండు కేసుల్లో దొంగిలించిన వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

ఆన్‌లైన్‌లో ప్రావిజినల్ మెరిట్ లిస్టు

కాకినాడ క్రైం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ పరిధిలో కొద్ది రోజుల కిందట వెలువడిన నోటిఫికేషన్‌కు సంబంధించి కీలక ప్రకటన వెలువడింది. ఎంపికైన అభ్యర్థుల ప్రావిజినల్ మెరిట్ జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపరిచినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహా నాయక్ తెలిపారు. తమ పేర్లు పరిశీలించుకునేందుకు ఈస్ట్‌గోదావరి.ఏపీ.జీవోవీ.ఇన్, కాకినాడ.ఏపీ.జీవోవీ.ఇన్, కోనసీమ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్లను సందర్శించాలన్నారు. అభ్యంతరాలు ఉంటే శుక్రవారం సాయంత్రం 5 గంటలలోపు కాకినాడలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అధికారులను సంప్రదించి తమ అభ్యంతరాలను సమర్పించాలని కోరారు.

అవినీతి లేని పాలనతోనే అభివృద్ధి

ఏసీబీ అదనపు ఎస్పీ సౌజన్య

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): అవినీతి లేని పరిపాలనా వ్యవస్థను తీసుకువచ్చినప్పుడే భారతదేశం మరింత అభివృద్ధి చెందుతుందని ఏసీబీ అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య అన్నారు. స్థానిక జేఎన్‌టీయూకే ప్రాంగణంలో గురువారం వర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్, యూసీఈకే ఎన్ఎస్ఎస్ యూనిట్–1, 2, ఓఎన్‌జీసీ సంస్థల సహకారంతో పీఈ–పీసీఈ సెమినార్ హాలులో విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజమహేంద్రవరం రేంజ్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అడిషనల్ ఎస్పీ సీహెచ్ సౌజన్య హాజరు కాగా, ప్రత్యేక అతిథిగా యూసీఈకే ప్రిన్సిపాల్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్, గౌరవ అతిథులుగా ఓఎన్‌జీసీ కాకినాడ అసెట్ విజిలెన్స్ ఇన్‌చార్జి కె.సోమశేఖర్, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ ఆర్.శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ నిజాయితీ, పారదర్శకత విలువల ఆధారంగా సమసమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. యూసీఈకే ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు అవినీతి రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులతో అతిథులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు కె.రమణాజీ, ఎంవీఎస్‌వీ కిరణ్మయి, డాక్టర్ పి.వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు

జిమ్నాస్టిక్స్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి



రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ జిమ్నాస్టిక్స్ పోటీల నిర్వహణకు సిద్ధం చేసిన కాకినాడ డీఎస్ఏ జిమ్నాజియం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా విద్యాశాఖ సహకారంతో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జిమ్నాస్టిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. 67వ పాఠశాల క్రీడా సమాఖ్య అండర్–14, 17, 19 జిమ్నాస్టిక్స్ పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం నుంచి 5 వరకూ నిర్వహించనున్న ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు హాజరవుతున్నారు. పోటీల నిర్వహణకు కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జిమ్నాజియాన్ని సిద్ధం చేశారు. ఆయా విభాగాల్లో బాల బాలికలకు నిర్వహించే ఈ పోటీల నుంచి జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టును ఎంపిక చేయనున్నారు.

పోటీల్లో పాల్గొనే వివిధ జిల్లాల క్రీడాకారులు, అతిథులకు వసతి ఏర్పాట్లు చేశారు. కాకినాడ జిల్లా ఎస్‌జీఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా విద్యాశాఖ అధికారిణి జి.నాగమణి ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రధానోపాధ్యాయులు రంగారావు, కె.నూకరాజు, రవిరాజు, బంగార్రాజు, శ్రీహరి, గిరి, వ్యాయామ ఉపాధ్యాయులు గురువారం పోటీల నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.